PRGI REGN NO: APTEL/26/A3695

నేటి మినిట్ టు మినిట్

తెలుగు దిన పత్రిక

NETI MINUTE TO MINUTE

TELUGU DAILY

సంపుటి: 01 సంచిక :105 ఎడిషన్ : అనంతపురము మరియు సత్యసాయి జిల్లా, తేది : బుధవారం - 30 సెప్టెంబర్ 2026, పేజీలు -4 వెల 1/-


VOLUME:01 ISSUE:105 EDITION: ANANTHAPURAMU, SATHYA SAI DIST. DATE: WEDNESDAY 30 SEPTEMBER 2026 PAGES: 04 RS:01/

వైసీపీ ఐదేళ్ల కంటే.. ఈ రెండేళ్లలోనే

పదింతల రోడ్ల నిర్మాణం

- పల్లె పండుగ 1.0, 2.0తో రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులు
- 100 రెట్లు ఎక్కువగా మినీ గోకులాలు
- ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 6,500 కి.మీ. సీసీ రోడ్ల నిర్మాణం
- అడవి తల్లిబాటలో 1,500 కి.మీ.కు పైగా రహదారుల నిర్మాణం
- గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ 3.0
- పల్లె పండుగ 3.0లో 6 వేల కి.మీ. సీసీ రోడ్లు, 9,500 కి.మీ. బీటీ రోడ్లు
- 22,500 మినీ గోకులాలు.. 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు





ఉదయగిరి,సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్): ఉదయగిరి వేదికగా రూ.11,085 కోట్ల పల్లెపండుగ 3.0కు శ్రీకారం చుట్టింది ప్రభుత్వం. ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పనులు ప్రారంభించారు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. 'పల్లెల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి పునాది. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడేలా, ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా సమగ్ర అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రహదారులు, తాగు నీరు, వ్యవసాయం, ఉపాధి, పరిశుభ్రత, మౌలిక వసతులతోపాటు పర్యాటక రంగానికీ ప్రాధాన్యం ఇస్తూ గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చే లక్ష్యంతో 'పల్లె పండుగ 3.0'కు శ్రీకారం చుట్టామ'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. పల్లె బలపడితేనే రాష్ట్ర భవిష్యత్తు బలపడుతుందనే సంకల్పంతో ప్రతి పల్లెను అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. మిగతా2లో...



మయన్మార్‌లో

వైమానిక దాడి..

- అరాకన్ ఆర్మీ ప్రాంతంలో సైన్యంపై దాడి
- 49 మంది మృతి, 58 మందికి గాయాలు

మయన్మార్,సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్): మయన్మార్ పశ్చిమ రఖైన్ రాష్ట్రంలో, తిరుగుబాటుదారుల బృందమైన అరాకన్ ఆర్మీ నియంత్రణలో ఉన్న ప్రాంతంలో సైన్యం జరిపిన వైమానిక దాడిలో కనీసం 49 మంది మరణించగా, 58 మంది గాయపడ్డారు. అరాకన్ ఆర్మీ, సహాయక చర్యలలో పాల్గొన్న ఒక అధికారి ప్రకారం, సోమవారం క్యౌక్తావ్ టౌన్‌షిప్‌లోని ఒక స్థానిక మార్కెట్ సమీపంలో ఒక యుద్ధ విమానం రెండు బాంబులను జారవిడిచింది. మృతులలో మార్కెట్ వ్యాపారులు, సరుకులు కొనడానికి వచ్చిన వినియోగదారులు, రోడ్డుపై నడుస్తున్న సాధారణ ప్రజలు ఉన్నారని చెబుతున్నారు. గాయపడిన వారిలో 22 మంది పరిస్థితి విషమంగా ఉందని అరాకన్ ఆర్మీ పేర్కొంది. ఘటనా స్థలంలోని సహాయక సిబ్బంది నుండి అందిన సమాచారం ఆధారంగా, రఖైన్‌లో సహాయక చర్యలలో పాల్గొంటున్న సీనియర్ అధికారి వాయ్ హ్టూన్ ఆంగ్ మృతుల సంఖ్యను మిగతా2లో...

పల్లె పండుగ 3.0తో గ్రామాల

రూపురేఖలు మారతాయి

- రూ.11,085 కోట్లతో గ్రామీణాభివృద్ధి పనులకు శ్రీకారం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



నెల్లూరు,సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్): 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంతో రాష్ట్రంలోని గ్రామాల రూపురేఖలు మారుతాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం రామాపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి ఆయన పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.11,085 కోట్లతో చేపట్టనున్న గ్రామీణాభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.గత రెండేళ్లలో మిగతా2లో...



అప్పుడు చెబితే నమ్మలేదు..

ఇప్పుడు అర్థమైంది

ఓట్ల చోరీ అంశంపై కాంగ్రెస్ నేతలకు రాహుల్ గాంధీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్): ఓట్ల చోరీ, ఓటర్ల జాబితా సవరణ అంశాలపై గత రెండేళ్లుగా తాను మాట్లాడుతున్నప్పటికీ పార్టీలోని కొందరు మిగతా2లో...

అమెరికాలో ఎస్సార్

భారీ ఉక్కు పరిశ్రమ

రూ.15 బిలియన్ డాలర్లతో ఐవాలో ప్లాంట్.. మొత్తం పెట్టుబడి 18 బిలియన్ డాలర్లు





సీడబ్ల్యూసీకి ముందు

కీలక నేతలతో రేవంత్ భేటీ

- రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్, డీకే శివకుమార్‌తో చర్చలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్): కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి ముందు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీకి చెందిన కీలక నేతలతో సమావేశమయ్యారు. రాహుల్‌గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో ఆయన చర్చలు జరిపినట్లు రేవంత్‌రెడ్డి మిగతా2లో...

ఎన్‌సీపీసీఆర్ తీరుపై

సుప్రీంకోర్టు అసంతృప్తి

- ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఆర్‌టీఈ కోటా అమలుపై ఆగ్రహం





నాతో పెట్టుకోవద్దు


- కేటీఆర్ వ్యాఖ్యలపై కవిత తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్,29(నేటి మినిట్ టు మినిట్): తాను ఏ విషయమైనా నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడుతానని, తనతో పెట్టుకోవద్దని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తాను ఎవరి మాటలు విని ఏది పడితే అది మాట్లాడబోనని స్పష్టం చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో స్పందించారు.అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలే కారణమన్న మిగతా2లో...

వైసీపీ ఐదేళ్ల కంటే.. ఈ రెండేళ్లలోనే పదింతల రోడ్ల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరిలో పల్లెపండుగ 3.0 కార్యక్రమం ద్వారా 11,085 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు తో కలసి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ఈ రెండున్నరేళ్లలో పల్లెపండుగ, జలజీవన్ మిషన్ – అమరజీవి జలధార, 15వ ఆర్థిక సంఘం నిధుల సద్వినియోగం, 10 వేలకుపైగా పదోన్నతులు, డి.డి.ఓ. కార్యాలయాల ఏర్పాటు.. ఇలా ఎన్నో సంస్కరణలతో ఒకవైపు గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తూనే, మరోవైపు వ్యవస్థను బలోపేతం చేశాం. ఒకప్పుడు పంచాయతీలు బ్లీచింగ్ పౌడర్ కూడా కొనలేని పరిస్థితి నుంచి, ఇప్పుడు తమ గ్రామానికి అవసరమైన పనులను తామే నిర్ణయించుకుని, తమ గ్రామ అభివృద్ధికి తామే ప్రణాళికలు రూపొందించుకునే స్థాయికి పంచాయతీ రాజ్ వ్యవస్థను తీసుకొచ్చాం.**గత ఐదేళ్ల కంటే రెండేళ్లలోనే పదింతల రోడ్ల నిర్మాణం**గత ప్రభుత్వం ఐదేళ్లలో 880 కి.మీ. సీసీ రోడ్లు నిర్మిస్తే, కూటమి ప్రభుత్వం ద్వారా కేవలం రెండేళ్లలోనే దానికి 10 రెట్లు ఎక్కువగా, దాదాపు 9,000 కి.మీ. సీసీ రోడ్లను పూర్తి చేశాం. గతంలో 304 మినీ గోకులాలు మాత్రమే నిర్మిస్తే, మనం దాదాపు 100 రెట్లు ఎక్కువగా, 30 వేలకు పైగా మినీ గోకులాలను నిర్మించాం. అలాగే, పల్లెపండుగ ద్వారా 13,326 గ్రామ పంచాయతీల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాం. ఇందులో భాగంగా 1 లక్ష 15 వేల పంట కుంటలను నిర్మించడంతోపాటు, 2 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలను అభివృద్ధి చేశాం. మరోవైపు, 10 వేల కిలోమీటర్ల బీటీ రోడ్ల పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. మన కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, ఇతర కాలనీల్లో 6,500 కిలోమీటర్ల సీసీ రోడ్లను ఇప్పటికే పూర్తి చేసింది. గిరిజన గ్రామాలకు రహదారి అనుసంధానాన్ని మరింత మెరుగుపరచేందుకు అడవితల్లిబాట కార్యక్రమం కింద రూ.2,180 కోట్ల వ్యయంతో సుమారు 2,437 కిలోమీటర్ల రహదారులను నిర్మించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. ఇందులో ఇప్పటికే 1500 కిలోమీటర్లకు పైగా అనుసంధాన రహదారులను నిర్మించాం. అలాగే, ఇప్పటివరకు రోడ్డు అనుసంధానం లేని బంజారా, యానాది, ఎరుకుల గిరిజన ఆవాసాలు



ఉన్న ప్రాంతాల్లో, పల్లెపండుగ ద్వారా 167 ఆవాసాలకు 111.4 కి.మీ. మేర రహదారి సౌకర్యం కల్పించాం.**పల్లెపండుగ 3.0తో గ్రామీణ ప్రగతికి కొత్త ఊపు**ఈ రోజు ఇక్కడ మనం రాష్ట్ర చరిత్రలో గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా, గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయకత్వంలో, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ అభివృద్ధిని పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళ్లబోతున్నాం. రూ.50 వేల కోట్లతో పల్లెపండుగ, జల జీవన్ మిషన్ – అమరజీవి జలధార వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయబోతున్నాం. ఇందులో రూ.30 వేల కోట్లతో అక్టోబర్ 5న గౌరవ ముఖ్యమంత్రివర్యులతో కలిసి జల జీవన్ మిషన్ – అమరజీవి జలధార కార్యక్రమం ద్వారా మల్టీ విలేజ్ స్కీమ్, సింగిల్ విలేజ్ స్కీమ్ పనులకు శంకుస్థాపనలు చేయబోతున్నాం. అలాగే రూ.9 వేల కోట్లతో పల్లెపండుగ 1.0, 2.0 కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసి, ఈ రోజు రూ.11,085 కోట్లతో ప్రతిష్టాత్మకంగా పల్లెపండుగ 3.0ను ప్రారంభిస్తున్నాం. ఇందులో భాగంగా 6 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, మరో 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలను అభివృద్ధి చేయబోతున్నాం. అలాగే, 1,000 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్లు, బస్ షెల్టర్లు, గ్రామ పంచాయతీ భవనాలు, రచ్చబండలు తదితర అభివృద్ధి పనులను చేపట్టబోతున్నాం. **పైలెట్ ప్రాజెక్ట్ గా డొంక రోడ్ల అభివృద్ధి** ఎన్నో ఏళ్లుగా రైతులు తమ పంటలను మార్కెట్‌కు తరలించేందుకు డొంక రోడ్ల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ముందుగా పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రతి నియోజకవర్గంలో ఒక డొంక రోడ్డును అభివృద్ధి చేయబోతున్నాం. ఆ తర్వాత 161 గ్రామీణ నియోజకవర్గాల్లో డొంక రోడ్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి, రైతులు తమ పంటలను సులభంగా మార్కెట్‌కు తీసుకెళ్లేలా రహదారి సౌకర్యాన్ని మెరుగుపరచబోతున్నాం. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోనే దాదాపు రూ.520 కోట్లతో పల్లెపండుగ పనులు చేపట్టాం. ఇంకా మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టబోతున్నాం. మన ఉదయగిరిలోనే పల్లెపండుగ ద్వారా రూ.121 కోట్లతో 115 కి.మీ. మేర సీసీ, బీటీ రోడ్లు, 1,200కు పైగా నీటి కుంటలు, 348 గోకులాలు, 190కి పైగా నీటి తొట్లు, సుమారు 900 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు వంటి అభివృద్ధి పనులను పూర్తి చేశాం. ఉదయగిరి నియోజకవర్గంలోని ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా, గతంలో నిలిచిపోయిన సుజల శ్రవంతి పథకం ద్వారా రూ.52 కోట్లతో, దుత్తలూరు, జలదంకి, కలిగిరి, కొండాపురం, సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు మండలాల్లో 381 పనులు చేపట్టబోతున్నాం. ఉదయగిరి కోటకు చేరుకునే మార్గంలో సుమారు 4 కి.మీ. రహదారిని రూ.2.5 కోట్లతో మంజూరు చేస్తున్నాం. దీనికి అవసరమైన అటవీ శాఖ అనుమతులను త్వరగా పొందేలా అధికారులతో సమన్వయం చేసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశిస్తున్నాను. **ప్రజల భాగస్వామ్యంతో ప్రగతి సాధ్యం** అభివృద్ధి పనుల్లో ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా చాలా ముఖ్యం. మన గ్రామంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనిని ప్రజలు తమ పనిగా భావించి, దాని పురోగతిని గమనించాలి. కాంట్రాక్టర్ పనులు నాణ్యతగా చేస్తున్నారా? నిబంధనల ప్రకారం పనులు జరుగుతున్నాయా? అనే విషయాలను ప్రజలు పరిశీలించాలి. ఎక్కడైనా అనుమానం వచ్చినా, నాణ్యతలో లోపం కనిపించినా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ, ఎన్.ఎం.డి. ఫరూక్, నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, బి.సి. జనార్ధన్ రెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, కమిషనర్ కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ శ్రీ హిమాన్షు శుక్లా, కూటమి పార్టీలకు చెందిన శాసన మండలి, శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు పాల్గొన్నారు.

అమెరికాలో ఎస్సార్ భారీ ఉక్కు పరిశ్రమ

వాషింగ్టన్,సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్): భారతదేశానికి చెందిన ఎస్సార్ గ్రూప్ అమెరికాలో భారీ ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. ఎస్సార్ గ్రూప్‌కు చెందిన మెసాబి మెటాలిక్స్ సంస్థ ఐవా రాష్ట్రంలో సుమారు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో సమగ్ర ఉక్కు కర్మాగారాన్ని నిర్మించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.ఈ ప్రాజెక్టులో ఐవాలో ఉక్కు తయారీ సముదాయంతో పాటు మిన్నెసోటాలోని మెసాబి ఐరన్ రేంజ్‌లో ఇనుప ఖనిజ గని, పెల్లెటైజింగ్ కేంద్రం ఉన్నాయి. మిన్నెసోటా గనిపై ఇప్పటికే దాదాపు 3 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టినట్లు సంస్థ తెలిపింది. దీంతో మొత్తం పెట్టుబడి సుమారు 18 బిలియన్ డాలర్లకు చేరనుంది.ఐవాలోని ప్లాంట్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత ఏటా సుమారు 10 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2030 నాటికి ఉత్పత్తి ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించినట్లు కంపెనీ, అమెరికా అధికారులు వెల్లడించారు.నిర్మాణ దశలో 8 వేలకుపైగా ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందని ఎస్సార్ గ్రూప్ తెలిపింది. ప్లాంట్ కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత కనీసం 1,750 మంది పూర్తిస్థాయి ఉద్యోగులు పనిచేయనున్నట్లు పేర్కొంది.

ఈ పెట్టుబడి నిర్మాణ కాలంతో పాటు ప్రారంభ కార్యకలాపాల తొలి పదేళ్లలో సుమారు 95 బిలియన్ డాలర్ల ఆర్థిక ఉత్పత్తికి దోహదం చేస్తుందని కంపెనీ అంచనా వేసింది.మిన్నెసోటాలోని గని నుంచి లభించే ఇనుప ఖనిజాన్ని ఐవా ప్లాంట్‌కు తరలించి ఉక్కు తయారీలో వినియోగించనున్నారు. ఈ విధంగా గనుల నుంచి ఉక్కు తయారీ వరకు అమెరికాలోనే పూర్తయ్యే సమగ్ర సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డైరెక్ట్ రిడ్యూస్డ్ ఐరన్ (డీఆర్ఐ), ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్ (ఈఏఎఫ్) విధానాలను ఉపయోగించనున్నట్లు ఎస్సార్ గ్రూప్ వెల్లడించింది.

సంప్రదాయ బ్లాస్ట్ ఫర్నేస్ విధానాలతో పోలిస్తే ఇంధన వినియోగం, ఉద్గారాలను తగ్గించే లక్ష్యంతో ఈ సాంకేతికతను వినియోగించనున్నట్లు తెలిపింది. వైట్‌హౌస్‌లో జరిగిన ప్రకటన కార్యక్రమంలో ఎస్సార్ గ్రూప్ వ్యవస్థాపకుడు, వైస్ చైర్మన్ రవి రుయా, మెసాబి మెటాలిక్స్ చైర్మన్ రేవంత్ రుయా పాల్గొన్నారు. అమెరికాలో ఉక్కు తయారీ సామర్థ్యాన్ని పెంచడం, స్థానిక ఉపాధి అవకాశాలను విస్తరించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాల్లో భాగంగా ఉన్నాయని సంస్థ పేర్కొంది.

ఎన్‌సీపీసీఆర్ తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్): ప్రైవేటు పాఠశాలల్లో పేద, బలహీన వర్గాల పిల్లలకు ఉచిత విద్య అందించేందుకు ఉద్దేశించిన 25 శాతం ఆర్‌టీఈ కోటా అమలుపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కోటా అమలుకు సంబంధించిన వివరాలను సమర్పించే విషయంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) వ్యవహరించిన తీరుపై ధర్మాసనం ప్రశ్నలు లేవనెత్తింది. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1)(సీ) ప్రకారం ప్రైవేటు, ఎయిడెడ్ కాని పొరుగు పాఠశాలలు ప్రవేశ స్థాయిలో కనీసం 25 శాతం సీట్లను బలహీన, వెనుకబడిన వర్గాల పిల్లలకు కేటాయించి ఉచిత ప్రాథమిక విద్య అందించాలి. ఈ నిబంధన సమర్థంగా అమలవుతున్న తీరును సుప్రీంకోర్టు పర్యవేక్షిస్తోంది.ఈ కేసు విచారణ సందర్భంగా ఎన్‌సీపీసీఆర్ సమర్పించిన అఫిడవిట్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. కేవలం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి సమాచారాన్ని సేకరించడం మాత్రమే ఎన్‌సీపీసీఆర్ బాధ్యత కాదని, ప్రతి పొరుగు పాఠశాలలో ఆర్‌టీఈ నిబంధన అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత కూడా ఉందని కోర్టు స్పష్టం చేసింది.ఎన్‌సీపీసీఆర్ తన అఫిడవిట్‌లో దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖలు రాసి ఆర్‌టీఈ చట్టంలోని సెక్షన్ 12(1)(సీ) అమలుకు సంబంధించిన నిబం ధనల వివరాలను కోరినట్లు తెలిపింది. అయితే తొమ్మిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఇంకా స్పందన రాలేదని వెల్లడించింది. మిగిలిన ప్రాంతాలు అమలు చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. అయితే సమాచార సేకరణతో ప్రక్రియను ముగించకుండా, చట్టం ఉద్దేశాన్ని ఆచరణలోకి తీసుకురా వాలని సుప్రీంకోర్టు సూచించింది. ఈ అంశంపై తదుపరి విచారణకు ఎన్‌సీపీసీఆర్ చైర్‌పర్సన్, డైరెక్టర్ హాజరుకావాలని ధర్మాసనం ఆదేశించింది. ఇది ధిక్కరణ కేసు కాదని, కమిషన్‌కు అప్పగించిన బాధ్యతపై స్పష్టత కల్పించేందుకే హాజరు కావాలని కోర్టు పేర్కొంది.2026 జనవరిలోనే సుప్రీంకోర్టు ఆర్‌టీఈ చట్టంలోని 25 శాతం కోటాను సమర్థంగా అమలు చేసేందుకు అవసరమైన నియమ నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది. బలహీన, వెనుకబడిన వర్గాల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశం కల్పించడం జాతీయ స్థాయి బాధ్యతగా పేర్కొంది.

సీడబ్ల్యూసీకి ముందు కీలక నేతలతో రేవంత్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు.ఈ భేటీలో తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన అంశాలతో పాటు దేశంలో నెలకొన్న పలు కీలక పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. తెలంగాణ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అదే సమయంలో జాతీయ స్థాయిలో సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అవసరమైన వ్యూహాలపైనా చర్చించినట్లు తెలిపారు.సీడబ్ల్యూసీ సమావేశంలో ఎన్నికల వ్యవస్థ, ఓటర్ల జాబితాల అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు నివేదికలు వెల్లడించాయి. కాంగ్రెస్ నేతలు ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ అంశానికి ప్రాధాన్యం ఏర్పడింది.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ సమావేశానికి రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్ తదితర సీనియర్ నేతలతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు.

మయన్మార్‌లో వైమానిక దాడి..

(మొదటి పేజీ తరువాయి)

ధృవీకరించినట్లు అసోసియేటెడ్ ప్రెస్ నివేదించింది. ఆ మార్కెట్ రాష్ట్రంలోని ప్రధాన టోకు వ్యాపార కేంద్రాలలో ఒకటి, ఇది వివిధ ప్రాంతాల నుండి వ్యాపారులను, వినియోగదారులను ఆకర్షిస్తుంది. తమ నియంత్రణలో ఉన్న ప్రాంతంలో జరిగిన ఈ ఘటనను ఒక తీవ్రమైన వైమానిక దాడిగా పేర్కొంటూ, బాధ్యులైన పక్షాలు, సంస్థలపై సమర్థవంతమైన ప్రతీకార చర్యలు తీసుకుంటామని అరాకన్ ఆర్మీ హెచ్చరించింది. దాడి తర్వాత సోషల్ మీడియాలో విడుదలైన ఫోటోలు, వీడియోలలో కొన్ని భవనాలు తగలబడుతుండటం, వాహనాలు దెబ్బతినడం, సమీపంలోని వంతెనలో కొంత భాగం ధ్వంసం కావడం కనిపించింది. ఈ ఘటనపై మయన్మార్ సైన్యం ఇంకా స్పందించలేదు. అయితే, తాము కేవలం చట్టబద్ధమైన సైనిక నిర్మాణాలనే లక్ష్యంగా చేసుకుంటామని సైన్యం గతంలో పేర్కొంది. తిరుగుబాటు గ్రూపులు ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపించింది. మయన్మార్‌లోని రెండవ అతిపెద్ద నగరమైన మాండలేకు పశ్చిమాన సుమారు 340 కిలోమీటర్ల దూరంలో క్యౌక్తావ్ ఉంది. ఈ ప్రాంతం ప్రస్తుతం అరాకన్ ఆర్మీ నియంత్రణలో ఉందని చెబుతున్నారు.

పల్లె పండుగ 3.0తో గ్రామాల రూపురేఖలు మారతాయి

(మొదటి పేజీ తరువాయి)

పల్లె పండుగ, జల్‌జీవన్ మిషన్ ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పవన్ కల్యాణ్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో రోడ్లు, మినీ గోకులాలు, ఫామ్ పాండ్స్ నిర్మించామని, మారుమూల తండాలకు సైతం రహదారి సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. అమరజీవి జలధార ద్వారా అనేక ప్రాంతాలకు తాగునీరు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 161 గ్రామీణ నియోజకవర్గాల్లో డొంక రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. గ్రామీణాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, కేంద్రం సహకారంతో పల్లె పండుగ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.పల్లె పండుగ 3.0 కింద గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, మినీ గోకులాలు, పశువుల తాగునీటి తొట్టెలు, వ్యవసాయ కుంటలు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడైంది. గ్రామాల్లో ప్రాథమిక సౌకర్యాలను మెరుగుపరచడం, రైతులు, పాడి రైతులకు మద్దతు అందించడం కార్యక్రమం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యమే దేశ ప్రగతికి పట్టుకొమ్మ అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా గాంధీజీ కలలను సాకారం చేసే దిశగా అడుగులు పడుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని తెలిపారు.కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పీవీఎన్ మాధవ్‌తో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పుడు చెబితే నమ్మలేదు.. ఇప్పుడు అర్థమైంది

(మొదటి పేజీ తరువాయి)

నేతలు తన మాటలను అప్పట్లో అంగీకరించలేదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నట్లు ఆంధ్రజ్యోతి కథనం తెలిపింది. మంగళవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం.ఓట్ల చోరీ అంశాన్ని తాను గతంలోనే ప్రస్తావించానని, ఇప్పుడు పార్టీ నేతలు కూడా దాని ప్రాధాన్యతను అర్థం చేసుకున్నారని రాహుల్ చెప్పినట్లు సమాచారం. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పార్టీ నేతలకు సూచించినట్లు తెలుస్తోంది. అలాగే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు సంబంధించిన ప్రశ్నలను కూడా బహిరంగంగా ప్రస్తావించాలని రాహుల్ సూచించినట్లు ఆంధ్రజ్యోతి పేర్కొంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కాంగ్రెస్‌లో చర్చ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.ఇటీవల ఢిల్లీలోని బేలా ఎస్టేట్‌లో ఓటర్ల పేర్ల తొలగింపుపైనా రాహుల్ గాంధీ ప్రశ్నలు లేవనెత్తారు. అక్కడ 728 మంది నివసిస్తుండగా, ఎస్ఐఆర్ అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితాలో ఒక్కరి పేరు మాత్రమే మిగిలిందని, 727 మంది పేర్లు తొలగించారని ఆయన ఆరోపించారు. ఈ అంశాన్ని కూడా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ నేతలకు సూచించినట్లు సమాచారం.

నాతో పెట్టుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ వ్యాఖ్యలను కవిత తప్పుబట్టారు. అహంకారం, అక్రమ దందాలతోనే పార్టీని పాతాళానికి నెట్టారని కేటీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు.తాను పార్టీలోని ఓ నేతపై అవినీతి ఆరోపణలు చేస్తే కొన్ని గంటల్లోనే తనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అదే వ్యక్తితో కలిసి ఉంటూ పార్టీ అధినేత నిర్ణయాలను బహిరంగంగా ప్రశ్నించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ఆమె ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని సంపాదించిన ఫామ్‌హౌస్‌లు, అనుమతులు, ఇతర వ్యవహారాలను ప్రస్తావిస్తూ కేటీఆర్‌పై విమర్శలు చేశారు.పార్టీలో జరిగిన వైఫల్యాలను అధినేత కేసీఆర్‌పై మోపడం సరికాదని కవిత అన్నారు. కేటీఆర్ మైండ్‌గేమ్‌ను నమ్ముతూ పార్టీకి నష్టం కలిగించవద్దని హెచ్చరించారు. గతంలో ప్రజలు, రైతులు ఎదుర్కొన్న సందర్భాలను ప్రస్తావిస్తూ కేటీఆర్ వ్యవహారశైలిపై ఆమె విమర్శలు చేశారు.

నేడు సిరిసిల్లకు సీఎం రేవంత్‌రెడ్డి

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..

భారీ బహిరంగ సభలో ప్రసంగం



సిరిసిల్ల,సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్): ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేడు సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో సిరిసిల్లకు తొలిసారి వస్తున్న ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, వివిధ పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం రగుడు బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా తొలుత కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రారంభించి, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. అనంతరం జిల్లా అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం సిరిసిల్లకు చేరుకోనున్న సీఎం రేవంత్‌రెడ్డి అంబేడ్కర్ చౌరస్తా నుంచి ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడి నుంచి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారు. అనంతరం రగుడు బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు.సిరిసిల్ల పర్యటనలో సుమారు రూ.345.78 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టనున్నట్లు ఇతర నివేదికలు పేర్కొన్నాయి. నేతన్నల సంక్షేమం, మహిళా సాధికారత, విద్య, మౌలిక వసతులు తదితర అంశాలకు సంబంధించిన కార్యక్రమాలు ఇందులో ఉన్నాయి.

నలకదొడ్డి విద్యా కమిటీ చైర్మన్‌గా టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవం



పత్తికొండ సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్):పత్తికొండ మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామంలో విద్యా కమిటీ ఎన్నికలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. విద్యా కమిటీ చైర్మన్‌గా బోయ శంకరబండ లింగన్న, వైస్ చైర్మన్‌గా మాదిగ సుమంగళమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, టీడీపీ తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోకేనాథ్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, అందరినీ సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు సజావుగా జరిగేలా టీడీపీ గ్రామ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, కౌలుట్లయ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. విద్యార్థుల తల్లిదండ్రులు, కమిటీ సభ్యులతో చర్చించి ఏకాభిప్రాయంతో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లను నాయకులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం విద్యా కమిటీ సభ్యులందరితో కలిసి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రఘుశేఖర్, దశరథ, రామలింగప్ప, రామాంజని, రామన్న, నరసప్ప, ఎరిస్వామి, మహిళలు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా కమిటీ చైర్మన్లుగా టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవం





పత్తికొండ సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్): పత్తికొండ పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, గురుకుల పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ల ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా జరిగాయి. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా లత, గురుకుల పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా ఎం.దేవరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ ఆదేశాల మేరకు టీడీపీ తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోకేనాథ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మద్దతుదారులను ఏకాభిప్రాయంతో చైర్మన్ పదవులకు ఎంపిక చేసేందుకు నాయకులు సమన్వయం చేశారు.నూతనంగా ఎన్నికైన చైర్మన్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. అనంతరం చైర్మన్లు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు సంబంధిత వర్గాల సహకారంతో పనిచేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాళ్లు, వైస్ చైర్మన్లు రాములమ్మ, పద్మావతి, మాదాసి మాదారి కురవ ఎస్సీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కేపీ బ్రహ్మయ్య, పత్తికొండ టీడీపీ నాయకులు పల్లె పవన్, రమేష్, కేపీ రమేష్, చిన్న, రవీంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కోమనూతల గ్రామంలో గంజాయి సాగు

- పోలీసుల అదుపులో నిందితుడు,750 గ్రాముల గంజాయి స్వాధీనం



పులివెందుల సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్):పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం కొమ్మనూతల గ్రామంలో గంజాయి సాగు తెలుగులోకి రాగా,నిందితుడిని అదుపులోకి తీసుకొని గంజాయి 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పులివెందుల డిఎస్పి మురళి నాయక్ పేర్కొన్నారు.మంగళవారం పులివెందులలోని డీఎస్పీ కార్యాలయం నందు డీఎస్పీ మురళీ నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసినటువంటి సమావేశంలో వివరాలు తెలియజేస్తూ లింగాల మండలంలో గంజాయి సాగు చేస్తున్నట్లు అందిన పక్కా సమాచారంతో కడప జిల్లా ఎస్పీ సెల్కే నచ్చికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, డీఎస్పీ పర్యవేక్షణలో రూరల్ సీఐ శాంతిలాల్,లింగాల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా కొమ్మనూతల గ్రామానికి చెందిన నడిపి వెంకటరమణ (63) తన పొలంలో సుమారు ఆరు అడుగుల ఎత్తు గల ఆరు గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు గుర్తించి 750 గ్రాములు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు,నిందితుడు తన అవసరాల కోసమే గంజాయి సాగు చేసి, సొంతంగా వాడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాజంపేట మున్సిపాలిటీకి త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయాలి

ఏకపక్ష నిర్ణయాలతో అభ్యర్థిని ఎంపిక చేస్తే పార్టీకి నష్టం

ఇన్‌చార్జి మంత్రికి సీనియర్ నాయకుడు కొమరా వెంకట నరసయ్య విజ్ఞప్తి



ఒంటిమిట్టసెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్): రానున్న రాజంపేట మున్సిపాలిటీ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి నియోజకవర్గ స్థాయిలో త్రిసభ్య సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని నియోజకవర్గ సీనియర్ నాయకుడు, రాష్ట్ర మాజీ కల్లుగీత కార్మిక సంఘం డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితమ్మను రినట్లు తెలిపారు. మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జి దీపక్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. రాజంపేట మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థి ఎంపికలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన సీనియర్ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని వెంకట నరసయ్య కోరారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సుధాకర్ గతంలో పార్టీ కష్టకాలంలోనూ చురుకుగా పనిచేశారని, చైర్మన్ పదవికి పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాని సమయంలో ఆయన పోటీ చేశారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయనకు అవకాశం కల్పిస్తే పార్టీ శ్రేణుల మద్దతుతో విజయం సాధించే అవకాశం ఉంటుందని వివరించారు. అదేవిధంగా మున్సిపాలిటీని ఓసీ వర్గానికి కేటాయించే పరిస్థితి ఉంటే దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేస్తున్న డాక్టర్ నవీన్‌కు అవకాశం కల్పించాలని కోరారు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకునేందుకు స్థానిక సంస్థల ఎన్నికల కోసం వెంటనే త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి తక్షణమే కీలక బాధ్యతలు లేదా టికెట్లు కేటాయించడం, ఏకపక్ష నిర్ణయాలతో అభ్యర్థులను ఎంపిక చేయడం వల్ల పార్టీకి నష్టం జరిగే అవకాశం ఉందని వెంకట నరసయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న నాయకుల అభిప్రాయం ఇదేనా అని ఇన్‌చార్జి మంత్రి సవితమ్మ ప్రశ్నించగా, నాయకులంతా ఏకగ్రీవంగా అవునని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఆర్టీసీ జోనల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, మేడ విజయశేఖర్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ నవీన్, జేసీబీ సుబ్బారెడ్డి, సంజీవరావు, వెంకటేశ్వర నాయుడు, మామిళ్లి ఈశ్వరయ్య, ఉన్నం కిరణ్‌స్వామి, లేబాక నరసయ్య, మాజీ ఎంపీపీ లక్ష్మీ నరసయ్యతో పాటు రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట మండలాలకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.


ఎస్సీ లీజుదారులు, వారసులకు జెడ్ హెచ్ డిసీ భూములపై హక్కులు



కడప,సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్): అర్హులైన ఎస్సీ లీజుదారులు, వారి చట్టబద్ధ వారసులకు జెడ్ హెచ్ డిసీ భూములను నిబంధనల మేరకు క్రమబద్ధీకరించి డికెటి పట్టాలు, పట్టాదారు పాస్‌బుక్కులు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత తెలిపారు. కడప కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి అసైన్‌మెంట్ కమిటీ సమావేశంలో మంత్రి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జేసీ డా. నిధి మీనా, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తదితరులు జెడ్ హెచ్ డిసీ భూముల క్రమబద్ధీకరణపై సమీక్షించారు. జిల్లాలో మూడు మండలాలు, నాలుగు గ్రామాలకు సంబంధించిన 304.274 ఎకరాల భూములకు 265 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో ఖాజీపేట మండలం చెముళ్లపల్లి, దుంపలగట్టు గ్రామాల్లో 150 మంది అర్హులకు సుమారు 150 ఎకరాలపై హక్కులు కల్పించేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. లేబాకలో 48 మంది, ఎల్లోపల్లిలో 67 మంది అర్హులను గుర్తించారు. అర్హత, రెవెన్యూ రికార్డులు, భూ స్వాధీనం, గ్రామసభల వివరాలను పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అర్హులకు త్వరలో భూ ధ్రువపత్రాలు అందించి, వెబ్‌ల్యాండ్ రికార్డులు నవీకరించి పట్టాదారు పాస్‌బుక్కులు అందజేస్తామని మంత్రి తెలిపారు. మైదుకూరు మండలం నంద్యాలంపేటకు సంబంధించిన 47.42 ఎకరాలు, 23 మంది లబ్ధిదారుల అంశం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉన్నందున కోర్టు ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని జేసీ తెలిపారు.

రాయలసీమ రైజింగ్‌పై కడపలో డ్రోన్ ఎల్ఈడీ ప్రదర్శన

గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌పై ప్రజల్లో అవగాహన, వినూత్నంగా ఆకట్టుకున్నా ప్రచార కార్యక్రమం



కడప సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్): రాయలసీమను ప్రపంచ ఉద్యాన పంటల కేంద్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "రాయలసీమ రైజింగ్ గ్లోబల్ హార్టికల్చర్ హబ్" కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కడప నగరంలో మంగళవారం వినూత్న ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్టోబరు 2న అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు "రాయలసీమ రైజింగ్ గ్లోబల్ హార్టికల్చర్ హబ్" కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, జిల్లా పౌరసంబంధాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు ప్రచారం విజయవంతంగా ముగిసింది. కడప ఆర్ట్స్ కళాశాల మైదానంలో సాయంత్రం 7 గంటలకు డ్రోన్ ఎల్ఈడీ ప్రదర్శన నిర్వహించారు. ఆకాశంలో డ్రోన్లతో ఎల్ఈడీ వెలుగుల ద్వారా "రాయలసీమ రైజింగ్ గ్లోబల్ హార్టికల్చర్ హబ్" సందేశాన్ని ప్రదర్శించడంతో మైదానానికి తరలివచ్చిన ప్రజలు ఆసక్తిగా తిలకించారు.రాయలసీమలో ఉద్యాన పంటల సాగును విస్తరించడం, ఆధునిక సాగు విధానాలను ప్రోత్సహించడం, రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం, ఉద్యాన ఆధారిత పరిశ్రమలు, ఉపాధి అవకాశాలను పెంచడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోందనే విషయాన్ని... డ్రోన్ ఎల్ఈడీ ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించడం జరిగింది."రాయలసీమ రైజింగ్" ప్రాజెక్టు ద్వారా కలిగే ప్రయోజనాలపై జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రజలు, రైతుల్లో అవగాహన కల్పించేలా వివిధ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కడప నగరంలో నిర్వహించిన డ్రోన్ ఎల్ఈడీ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



ఉపాధి హామీ, సదరమ్ విభాగాల్లో అక్రమాలపై విచారణ జరపాలి

- జనగామ కలెక్టర్‌కు టీపీఆర్‌పీ అధ్యక్షుడు జిలుకర రవికుమార్ విజ్ఞప్తి

జనగామ,సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్): జిల్లాలో ఉపాధి హామీ పథకం, సదరమ్ క్యాంపులు, పింఛన్ల మంజూరులో అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రజా రాజ్యం పార్టీ (టీపీఆర్‌పీ) అధ్యక్షుడు జిలుకర రవికుమార్ జిల్లా కలెక్టర్‌ను కోరారు.ఉపాధి హామీ పథకంలో కొందరు టీఆర్‌డీఏ సిబ్బంది 10 నుంచి 15 ఏళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్నారని పేర్కొంటూ, దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లను అవసరమైన చోట బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు.సదరమ్ క్యాంపుల్లో అనర్హులకు అధిక శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారన్న ఆరోపణలపై విచారణ జరపాలని కోరారు. పింఛన్ల లబ్ధిదారుల అర్హతలను గ్రామాల వారీగా పరిశీలించి, అనర్హులను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.ఉపాధి హామీ తరహాలో పింఛన్లు, సదరమ్ ధ్రువీకరణ పత్రాలపైనా సామాజిక తనిఖీలు నిర్వహించి, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన పేదలకు చేరేలా చర్యలు తీసుకోవాలని రవికుమార్ కోరారు.



పొడి చెత్త సేకరణకు 'దసరా ధమాకా'

10 కిలోలకు పైగా పొడి చెత్త అందిస్తే లక్కీ డ్రా ద్వారా ఆకర్షణీయమైన బహుమతులు: జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి, సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్): మంగళవారం కలెక్టరేట్ లో దసరా పండుగను పురస్కరించుకుని "దసరా ధమాకా" పేరుతో ప్రతి మండలంలో పొడి చెత్త సేకరణ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించనున్నారని, ఇందులో భాగంగా 10 కిలోలకు పైగా పొడి చెత్తను అందజేసే వారికి లక్కీ డ్రా ద్వారా బహుమతులు అందించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలనిజిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు.గ్రామాలు, మండలాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు ఇళ్లలో పేరుకుపోయే పొడి చెత్తను సేకరించి, పునర్వినియోగం చేసేలా ప్రజలను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ కమిషనర్ గారి సూచనల మేరకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. "పొడి చెత్తను వృథాగా పారేయకండిడ సేకరించి అందించండి పరిశుభ్రమైన గ్రామ నిర్మాణంలో మీ వంతు భాగస్వామ్యం అందించండి." అనే నినాదంతో జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా బుక్కపట్నం మండలానికి సంబంధించిన ప్రచార సామగ్రిని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ జిల్లా కలెక్టరేట్లో ఈరోజు విడుదల చేశారు. బుక్కపట్నం మండలంలో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో లక్కీ డ్రా ద్వారా ప్రథమ బహుమతిగా ఫ్రిజ్, ద్వితీయ బహుమతిగా సైకిల్, తృతీయ బహుమతిగా కిచెన్ ఐటమ్స్, నాల్గవ బహుమతిగా కుక్కర్ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు తమ ఇళ్లలోని ప్లాస్టిక్, పేపర్, కార్డ్‌బోర్డ్, ఇనుము తదితర పొడి చెత్తను వేరు చేసి సేకరించి అందించడం ద్వారా పరిశుభ్రతతో పాటు వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణలో భాగస్వాములు కావాలని అధికారులు కోరారు. "పొడి చెత్తను బయట పడేయకుండాడ సేకరించి అందిద్దాం పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంలో భాగస్వాములమవుదాం" అనే సందేశంతో ఈ ప్రచార కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లనున్నారు.

ధర్మవరంలో మూడు ఇళ్లలో చోరీకి యత్నం

గ్రిల్లు, ఇనుప చువ్వలు కోసిన దొంగలు.. శబ్దంతో మేల్కొన్న కుటుంబాలు



ధర్మవరం: సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్): పట్టణంలోని గీతానగర్‌లో ఆదివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఒకేసారి మూడు ఇళ్లలో చోరీకి యత్నించి కలకలం సృష్టించారు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది.నాగశేషకు చెందిన ఇంటి కిటికీ గ్రిల్‌ను రంపంతో కోసి లోపలికి ప్రవేశించేందుకు దొంగలు ప్రయత్నించారు. అదే విధంగా రంగనాథ్, ఫణీంద్రకు చెందిన ఇళ్ల గేట్లు, తలుపులకు ఉన్న ఇనుప చువ్వలను కోసేశారు.అయితే ఇనుప చువ్వలు కోసే సమయంలో శబ్దం రావడంతో అప్రమత్తమైన రంగనాథ్, ఫణీంద్ర కుటుంబ సభ్యులు లైట్లు వేశారు. దీంతో దొంగలు అక్కడి నుంచి పరారైనట్లు స్థానికులు తెలిపారు. **సీసీ కెమెరాల దిశ మార్చి.. చోరీకి స్కెచ్**దొంగలు ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గుర్తించి వాటి దిశను మార్చినట్లు పోలీసులు గుర్తించారు. అయినప్పటికీ కెమెరాల్లో దొంగల కదలికలకు సంబంధించిన దృశ్యాలు నమోదయ్యాయి.కెమెరా ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు చోరీకి వచ్చిన వారు ఏడుగురు ఉన్నట్లు గుర్తించారు. వీరు ఉత్తరాది రాష్ట్రాలకు చెందినవారై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. **రంగంలోకి క్లూస్ టీం**సమాచారం అందుకున్న ధర్మవరం వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా నిందితుల ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. సీసీ కెమెరాలో నిక్షిప్తమైన అనుమానిత దొంగ దృశ్యం.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి పూజలు

- శ్రీ సీతారామాంజనేయ దేవస్థానంలో ప్రత్యేక పూజలు.. పాల్గొన్న భక్తులు



అనంతపురం, సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్): శ్రీనివాస్‌నగర్‌లోని శ్రీ సీతారామాంజనేయ దేవస్థానంలో సంకష్టహర చతుర్థి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంకాలం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజే శారు. ఆలయ ప్రాంగణం భక్తుల నామస్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

పితృదేవతల స్మరణకు.. ముక్తి హోమం

- మహాలయపక్షాలను పురస్కరించుకుని సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం



అనంతపురం, సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్): మహాలయపక్షాలను పురస్కరించుకుని సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో గతించిన పితృదేవతలను స్మరించుకుంటూ ముక్తి హోమం, ముక్తి దీపం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అక్టోబర్ 4న మారుతీనగర్‌లోని సీతారామ ఫంక్షన్ హాల్, శ్రీ కోదండరామస్వామి దేవాలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరగనుంది.ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను చిన్మయ మిషన్‌కు చెందిన శ్రీ ఆత్మవిద్యానంద స్వామిజీ ఆవిష్కరించారు. స్వామిజీ మాట్లాడుతూ గతించిన పూర్వీకులను స్మరించుకోవడం వారికి అందించే నిజమైన గౌరవమని పేర్కొన్నారు. పితృదేవతల ఆశీస్సులు పొందేందుకు మహాలయపక్షాల్లో నిర్వహించే ముక్తి హోమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.సాయి ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ విజయ్ సాయికుమార్ మాట్లాడుతూ మనకు శరీరం, గోత్రం, సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఎన్నో విలువలను అందించిన పూర్వీకులను స్మరించుకోవడానికే మహాలయపక్షాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. అక్టోబర్ 4న నిర్వహించే ముక్తి హోమం, ముక్తి దీపం కార్యక్రమంలో ఆసక్తిగల వారు పాల్గొనాలని కోరారు.కార్యక్రమానికి సంబంధించిన వివరాల కోసం డాక్టర్ విజయ్ సాయికుమార్ 8712345520 ను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

' చైన్ స్నాచింగ్ చకచకా.. అనంతలో జనం తికమక '

- అనంతపురంలో కలకలం.. వరుసగా ఐదు చోట్ల చైన్ స్నాచింగ్
- అనంతలో చైన్ స్నాచర్ల హల్‌చల్.. వరుస ఘటనలతో 'వామ్మో' అంటున్న జనం
- పది నిమిషాలకో చైన్.. స్నాచర్ల స్పీడుకు బ్రేకులెక్కడ?
- అరగంటలో ఐదు చైన్లు.. ఇదేం స్నాచర్ల స్పీడ్
- సినిమా సీన్‌ను తలపించిన చైన్ స్నాచింగ్.. అనంతలో కలకలం
- ఒక్కటితో ఆగలేదు.. వరుసగా ఐదు చైన్లపై స్నాచర్ల కన్ను
- చైన్ స్నాచర్ల 'రూట్ మ్యాప్'పై ఆసక్తికర చర్చ.. వరుస ఘటనలతో కలకలం
- ఉదయం పూటే స్నాచర్ల సందడి.. బయటకు రావాలంటే జాగ్రత్త అంటున్న జనం
- చైన్ స్నాచర్లకు 'గోల్డ్ రన్'.. వరుస ఘటనలతో అనంతలో అలజడి
- ఐదు చోట్ల చైన్ స్నాచింగ్.. స్నాచర్ల స్కెచ్‌పై సర్వత్రా చర్చ
- నిమిషాల వ్యవధిలో సీన్ రిపీట్.. అనంతలో చైన్ స్నాచర్ల హల్‌చల్
- చైన్ కోసం ఛాన్స్ చూస్తున్న స్నాచర్లు.. అప్రమత్తంగా ఉండాలంటున్న ప్రజలు
- అనంతలో చైన్ స్నాచర్ల దూకుడు.. వరుస ఘటనలతో జనం బెంబేలు





మీడియాకు వివరాలు వెలడిస్తున్న స్థానికులు

అనంతపురం, సెప్టెంబర్ 29(నేటి మినిట్ టు మినిట్): అనంతపురం పట్టణంలో వరుస చైన్ స్నాచింగ్ ఘటనలు కలకలం రేపాయి. తెల్లవారుజామునే సుమారు ఐదు ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌లు జరగడం స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది. దాదాపు పది నుంచి పదిహేను నిమిషాల వ్యవధిలోనే వరుస ఘటనలు చోటుచేసుకున్నట్లు సమాచారం.ప్రతిరోజూ పోలీసులు ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో తనిఖీలు, గస్తీ నిర్వహిస్తున్నప్పటికీ దొంగలు వరుస ఘటనలకు పాల్పడటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **పక్కా ప్లాన్‌తోనేనా?**వరుస ఘటనలు జరిగిన ప్రాంతాలను పరిశీలిస్తే నగర శివారు ప్రాంతాల్లో ఒక నిర్దిష్ట మార్గంలో చైన్ స్నాచింగ్‌లు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఒక ఘటన తర్వాత మరో ప్రాంతానికి వెళ్లి మరొక ఘటనకు పాల్పడిన తీరు చూస్తుంటే ముందస్తు ప్రణాళికతోనే ఈ నేరాలకు పాల్పడినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.చైన్ స్నాచింగ్ అనంతరం నిందితులు వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనల వెనుక ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఉన్నారా? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. **మహిళలే లక్ష్యంగా**ఉదయం వేళల్లో మహిళలు నిత్యావసర వస్తువుల కోసం బయటకు వెళ్లడం, ఇంటి పనుల నిమిత్తం రోడ్లపైకి రావడం వంటి పరిస్థితులను దొంగలు తమకు అనుకూలంగా మార్చుకున్నట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. సాధారణ ప్రజలు తమ రోజువారీ పనుల కోసం బయటకు వస్తున్న సమయంలోనే చైన్ స్నాచింగ్‌లు జరగడం మరింత ఆందోళన కలిగిస్తోంది. **పోలీసుల గస్తీ ఉన్నా వరుస ఘటనలు**పట్టణంలో పోలీసులు షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వహిస్తూ పగలు, రాత్రి గస్తీ, వాహన తనిఖీలు చేపడుతున్నప్పటికీ ఇలాంటి వరుస ఘటనలు చోటుచేసుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది. నిందితులను త్వరగా గుర్తించి అరెస్టు చేయాలని ప్రజలు కోరుతున్నారు. **రూట్ మ్యాప్‌పై దృష్టి**వరుసగా ఐదు ప్రాంతాల్లో జరిగిన చైన్ స్నాచింగ్ ఘటనలను పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా పరిశీలించాల్సి ఉంది. నిందితులు ఏ మార్గంలో వచ్చారు, ఘటనల అనంతరం ఏ దిశగా వెళ్లారు, ఉపయోగించిన వాహనం ఏమిటి అనే అంశాలపై దర్యాప్తు చేస్తే కీలక ఆధారాలు లభించే అవకాశం ఉంది.ఒకే ఉదయం తక్కువ వ్యవధిలో ఐదు చోట్ల చైన్ స్నాచింగ్‌లు జరగడంతో అనంతపురం ప్రజలు అప్రమత్తమయ్యారు. నిందితులను గుర్తించి అరెస్టు చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు. **చైన్ స్నాచింగ్‌కు పల్సర్ బైక్‌నే వాడారా?**అనంతపురంలో వరుసగా చోటుచేసుకున్న చైన్ స్నాచింగ్ ఘటనల్లో నిందితులు పల్సర్ బైక్‌ను ఉపయోగించినట్లు సమాచారం. దీంతో పోలీసులు అప్రమత్తమై పల్సర్ బైక్‌లపై ప్రత్యేక దృష్టి సారించారు.ఉదయం నుంచే పట్టణంలో పల్సర్ బైక్‌లపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తులను ఆపి వారి వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. బైక్‌కు సంబంధించిన పత్రాలు, ప్రయాణ ఉద్దేశం తదితర వివరాలను పరిశీలిస్తున్నారు.అదే సమయంలో, ఘటనలకు సంబంధించిన ఏదైనా సమాచారం ప్రజల వద్ద ఉంటే పోలీసులకు అందించాలని అధికారులు కోరుతున్నారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.పట్టణంలో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు కనిపించినా, ముఖ్యంగా అనుమానాస్పద వాహనాలు లేదా వ్యక్తుల కదలికలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. **ఐదు చోట్ల చైన్ స్నాచింగ్.. అనంతలో కలకలం అనంతపురం:** జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వరుసగా ఐదు చైన్ స్నాచింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయి. రాప్తాడు, అనంతపురం వన్‌టౌన్, టూటౌన్, బుక్కరాయసముద్రం పరిధుల్లో మహిళలను లక్ష్యంగా చేసుకుని దుండగులు చైన్‌లు లాక్కెళ్లినట్లు ఫిర్యాదులు అందాయి. **రాప్తాడు:** ప్రసన్నయ్యపల్లి ప్రాంతానికి చెందిన లక్ష్మీదేవి (45) అంగడిలో ఉన్న సమయంలో ఆమె మెడలోని రోల్డ్‌గోల్డ్ చైన్‌ను దుండగులు లాక్కెళ్లారు. **అనంతపురం వన్‌టౌన్:** వినాయకనగర్‌కు చెందిన విజయ (57) వాకింగ్ చేస్తుండగా దుండగులు సుమారు నాలుగు తులాల చైన్‌ను లాక్కెళ్లారు. **అనంతపురం టూటౌన్:** సాయినగర్ యూత్ క్రాస్ ప్రాంతానికి చెందిన శ్యామలాదేవి (60) అంగడి నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా సుమారు మూడు తులాల చైన్‌ను లాక్కెళ్లారు. **బుక్కరాయసముద్రం:** వీరభద్ర కాలనీకి చెందిన నాగరత్నమ్మ (70) భర్తతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా సుమారు ఐదు తులాల బంగారు చైన్‌ను లాక్కునేందుకు దుండగులు ప్రయత్నించారు. ఈ ఘటనలో చైన్‌లో కొంత భాగం ఆమె చేతికి చిక్కగా, మిగిలిన భాగాన్ని దుండగులు తీసుకెళ్లినట్లు సమాచారం. **బుక్కరాయసముద్రం:** వడియంపేట సమీపంలో లక్ష్మీ (52) కిరాణా షాప్ ముందు కూర్చుని ఉన్న సమయంలో సుమారు మూడు తులాల చైన్‌ను దుండగులు లాక్కెళ్లారు. వరుస ఘటనలతో ఆయా ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది. ఘటనలకు సంబంధించి పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీలు, అనుమానాస్పద వాహనాల కదలికలను పరిశీలిస్తూ నిందితుల ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

M/S SUNIL PUBLICATIONSPrinting Press (Name & Address)PrinterM/S SUNIL PUBLICATIONS D.NO.: 28-5-782, HOUSING BOARD COLONY, REVENUE WARD NO. 28, ANANTAPUR., ANDHRA PRADESH - 515001.